క్లుప్తంగా

సొంత భవనంలో పైడితల్లి అమ్మవారి అన్నదాన సత్రం



అన్నదాన సత్రంలో భోజనాలు వడ్డిస్తున్న ఆలయ కార్యనిర్వహణ అధికారి ప్రసాద్

విజయనగరం టౌన్: శ్రీ పైడితల్లి అమ్మవారి నిత్య అన్నదానానికి సంబంధించి నూతన భవనంలోకి అన్నదాన సత్రం మార్చినట్టు ఆలయం కార్యనిర్వహణ అధికారి డి.వి.వి.ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నూతన అన్నదాన సత్రంలో భక్తులకు భోజనాలను వడ్డించారు. ఆలయం అభివృద్ధికి దాతలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్ ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి



పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

విజయనగరం ఫోర్ట్: పేదలకు చేయూతనివ్వడంలో సంతృప్తి ఉందని మారుతీ స్వయం సహాయక సంఘం అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక కణపాక అగుర వీధిలో శుక్రవారం 50 మంది పేదలకు బియ్యం, గోధుమ నూక, నూనె వంటి నిత్యావసర వస్తువులు సంఘం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలన్నారు. గత 15 ఏళ్లుగా పేదలకు దాతల సహాయంతో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తులసీరామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట వద్ద ఉన్న 11 కేవీ ఫీడర్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ పూడి హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామునిపేట, గొర్లిపేట, కొత్తపేట, దీపిల్లిపేట, తుమ్మలపేట, జగ్గరాజుపేట, దన్నానపేట, కోరాడపేట, కుదిపి, నీలంరాజుపేట, ఏటీ అగ్రహారం గ్రామాలతో పాటు 11 కేవీ తాగు నీటి పథకాలకు, పట్టణంలోని జగనన్న హౌసింగ్ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, మిమ్స్ ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వడదెబ్బపై అప్రమత్తం



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సూచించారు. మండలంలోని జె.గుమడాం గ్రామంలో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. ఉదయం 10 గంటల తరువాత ఇంటి నుంచి బయటకు రావాల్సి వస్తే వెంట గొడుగు, వాటర్ బాటిల్ తీసుకుని వెళ్లాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ డి.వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.89 వేల నగదు సీజ్

రామభద్రపురం: మండలంలోని మిర్తివలస జంక్షన్ వద్ద గురువారం రాత్రి చేపట్టిన వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.89,530 నగదు పట్టుకుని, సీజ్ చేసినట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ శుక్రవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఒడిశా నుంచి రామభద్రపురం వైపు వస్తున్న ఓ కారులో ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న డబ్బులు పట్టుకున్నామని, తదుపరి చర్యలకు జెడ్పీ సీఈవోకు పంపించామన్నారు.

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు శుక్రవారం జరిపిన వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.5,23,300 పట్టుబడింది. పొందూరు వైపు నుంచి వస్తున్న కారును, ఆపి సోదాలు చేయగా, ఈ నగదు లభ్యమైందని సీఐ డి.మోహనరావు తెలిపారు. సంబంధిత నగదుకు సంబంధించి, సరైనా ఆధారాలు చూపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లకూడదన్నారు.

బొబ్బిలి: పాతబొబ్బిలి చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం చేపట్టిన వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.5,59,500 నగదును పట్టుకుని, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి.లోవరాజు తెలిపారు. తదుపరి చర్యల కోసం జెడ్పీ సీఈవోకు ఈ నగదును పంపించామన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సుపరిపాలన

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



ధర్మపురిలో ఓటును అభ్యర్థిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్రంలో, జిల్లాలో సుపరిపాలన కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీకి ప్రజలంతా మద్దతివ్వాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ధర్మపురిలో శుక్రవారం జరిగిన ఇంటింటికి ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. కోలగట్ల రాకను పురస్కరించుకుని స్థానికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి దీవించి, పూల వర్షం కురిపించారు. అనంతరం కోలగట్ల ఇంటింటికి వెళ్లి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలియజేయాలని అభ్యర్థించారు. సామాన్యుడికి అవకాశం ఇస్తే పాలన ఎలా ఉంటుందో గడిచిన ఐదేళ్ల పాలనను ప్రజలు గమనించాలన్నారు. మరో సారి అవకాశం ఇస్తే సమస్యలు లేని నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి కనకల కృష్ణ, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావులు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామి గత 5 ఏళ్లుగా నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకున్నారన్నారు. మరోసారి కోలగట్ల వీరభద్రస్వామిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే మరింత అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. నగర మేయర్ వి.విజయలక్ష్మి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం రేపు



మొయిదలో ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబుతో కలిసి సభా స్థలిని పరిశీలిస్తున్న నాయకులు, ప్రజా ప్రతినిధులు

- ఎమ్మెల్సీ పెనుమత్సతో కలిసి సభాస్థలిని పరిశీలించిన నేతలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద విజయరామపురం గ్రామంలో ఈ నెల 14న జరగనున్న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు చనమళ్ల వెంకటరమణ, చిక్కాల సాంబశివరావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణ రాజు(సురేష్ బాబు)తో కలిసి మొయిద గ్రామంలో శుక్రవారం సభాస్థలిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో 14న ఉదయం 10 గంటలకు మండల, పట్టణ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించేందుకు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యే సిద్ధం సభలను విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన విధి విధానాలపై ముఖ్య నేతలు దిశా నిర్దేశం చేస్తారన్నారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, వైస్ చైర్మెన్ సముద్రపు రామారావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్ బాబు, కార్పొరేషన్ డైరెక్టర్లు రేగాన శ్రీనివాసరావు, మద్దిల వాసు, కౌన్సిలర్లు నల్లి శ్రీను, మైపాడ ప్రసాదరావు, మురళి, సర్పంచ్‌లు అట్టాడ కృష్ణ, లెంక గోవింద, దవళ లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మెన్ కోట్ల పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లోని శ్రీ క్షేత్రమ్‌లో కొలువై ఉన్న శ్రీఅష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో విజయలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస్ రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి స్నపనం, పంచామృతాభిషేకాలు, అర్చన నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



పూసపాటిరేగ: రాజీనామా చేసిన చౌడువాడ సచివాలయం వలంటీరులు



నెల్లిమర్ల రూరల్: రాజీనామా చేసిన వలంటీర్లు

పూసపాటిరేగ : మండల కేంద్రానికి చెందిన 25 మంది వలంటీరులు శుక్రవారం రాజీనామా చేసారు. చౌడువాడలో 14 మంది, పతివాడలో 12 మంది, వెల్దూరులో 11 మంది, గుంపాంలో 10మంది వలంటీరులు రాజీనామా పత్రాలను ఆయా సచివాలయాలు కార్యదర్శులకు అందజేశారు. వలంటీరు ఉద్యోగాలకు రాజీనామా చేసి జగనన్నకు మద్దతు తెలపడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేస్తామన్నారు.

భోగాపురంలో..

భోగాపురం: మండలంలోని రామచంద్రపేట సచివాలయ పరిధి వలంటీర్ ఇప్పిలి గోవింద్ రాజీనామా చేసినట్లు పంచాయతీ సెక్రటరీ రమణమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నెల్లిమర్లలో...

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పని చేస్తున్న గ్రామ వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. అలుగోలు సచివాలయం నుంచి 15 మంది, బూరాడపేట సచివాలయ పరిధిలో 17 మంది, కొండవెలగాడ నుంచి 10 మంది, రామతీర్థం సచివాలయ పరిధిలో నలుగురు వలంటీర్లు రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను స్థానిక కార్యదర్శులతో పాటు మండల స్థాయి అధికారులకు అందజేశారు.



విజయనగరం: సారిక గ్రామ పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందజేస్తున్న గ్రామ వలంటీర్లు



రాజీనామా పత్రాలు కమిషనర్‌కి అందజేస్తున్న వలంటీర్లు

విజయనగరంలో...

విజయనగరం రూరల్: మండలంలోని సారిక, నారాయణపురం గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 20 మంది గ్రామ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులు రాంబాబు, రవికి అందజేశారు. సారిక నుంచి ఏడుగురు, రీమాపేట నుంచి ఒకరు, నారాయణపురం నుంచి 12 మంది రాజీనామా చేసినట్లు అధికారులు తెలిపారు.

నెల్లిమర్లలో...

నెల్లిమర్ల: నగర పంచాయతీలో అగురు వీధి సచివాలయం 7వ వార్డుకు చెందిన ఐదుగురు వార్డు వలంటీర్లు రాజీనామా చేస్తూ నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్‌కు రాజీనామా పత్రాలు శుక్రవారం అందజేశారు.

ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి, సంక్షేమం చేసి చూపిస్తాం

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

సంతకవిటి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను, వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి అధికారంలోకి తీసుకువస్తే మరింత అభివృద్ధి, సంక్షేమం చేసి చూపిస్తామని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని చిన్నయ్యపేట, కాకరాపల్లి, అక్కరాపల్లి, మందరాడ గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని, ఆ దిశగా ఆయన పాలన కొనసాగించారన్నారు. ప్రతీ ప్రాంతంలో కొత్తగా అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రతీ గ్రామంలోని ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు రూపొందించి, అమలు చేశారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు.



సంతకవిటి: సంతకవిటిలో ఎన్నికల ప్రచారంలో రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ తదితరులు

వైఎస్సార్ సీపీతోనే అన్నివర్గాలకు మేలు అని, వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా మరోసారి పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ గండ్రేటి కేసరి, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్ నాయుడు, ఎంపీటీసీ పి.శంఖరరావు, కాకరాపల్లి సర్పంచ్ వావిలపల్లి రమణ, మందరాడ సర్పంచ్ వావిలపల్లి సాయిలత, ఎంపీటీసీ వావిలపల్లి శ్రీనివాసనాయుడు, తాలాడ ఎంపీటీసీ కనకల సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి..

రాజాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య అన్నారు. స్థానిక పట్టణ పరిధిలోని మాధవబజార్, కిరాణా మార్కెట్, గాంధీనగర్, తాణావీధి ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన వారు ఇంటింటికీ వెళ్లి, ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. అలాగే గతంలో అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ ప్రజలను మోసగించిన తీరును తెలిపారు. ఎన్నికల వేళ మాయ మాటలు చెప్పి, మళ్లీ ప్రజలను మోసగించాలని చూస్తున్న టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దని, మనమంతా బాగుండాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకే ఓటు వేయాలని తెలిపారు. రాజాం ఎమ్మెల్యేగా డాక్టర్ తలే రాజేష్‌ను ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, పార్టీ నాయకులు దూబ గోపాలం, శాసపు వేణుగోపాలనాయుడు, ముగడ రవి, పాలవలస శ్యామ్, వివేకానందరావు, తోట తిరుమలరావు, కోల్లా రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా



ఎం.వర్షిత, 979, ఎంపీసీ, ఎంజేబీపీ బీసీ గురుకుల బాలికల కళాశాల, నెల్లిమర్ల



ఎస్.వాణి, 976, ఎంపీసీ, ఎంజేబీపీ బీసీ గురుకుల బాలికల కళాశాల, నెల్లిమర్ల



డి.ఆరుద్ర, 450, ఎంపీసీ, ఆదర్శ పాఠశాల, సతివాడ



పి సుశీల, 967, బైపీసీ, ఆదర్శ పాఠశాల, సతివాడ



రుంకాన గాయత్రి, 989, ఎంపీసీ



కె.నాగవినయ్‌కుమార్, 463, ఎంపీసీ



పి.లక్ష్మీస్పందన, 973, ఎంఈసీ



బి.తేజేష్, 965, ఎంఈసీ

ఇంటర్ పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు తమ సత్తా చాటారు. మంచి మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. సత్తా చాటిన విద్యార్థులను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు. – సాక్షి నెట్‌వర్క్

జగనన్నతోనే సంక్షేమ రాజ్యం



తిప్పలవలసలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అప్పలనాయుడు తదితరులు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బడ్డుకొండ

పూసపాటిరేగ : సంక్షేమ రాజ్యం కోసం ప్రజలంతా జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని తిప్పలవలస, కిలుగుపేట, వెల్దూరు, బూరపేట గ్రామాలలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, యువత అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో చేకూరిన లబ్ధిపై ఇంటింటికి వెళ్లి వివరించి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నవరత్నాలతో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు లబ్ధి అందించామనే విషయం ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేసే ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీయేనని స్పష్టం చేశారు. జన బలం ఉన్న జగనన్నను ఎదుర్కొనేందుకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు కూటమిగా జత కట్టాయని, అయినా ప్రజలు విశ్వసించడం లేదన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, దారపు గున్నారెడ్డి, దారపు అప్పలసూర్రెడ్డి, వాసుపల్లి అప్పన్న, పుప్పాల లక్ష్మీనారాయణ, లంకలపల్లి రాజారావు, బొల్లు రమేష్, బావిశెట్టి నారాయణరావు, దాడిశెట్టి త్రినాధరావు, వాళ్లె అచ్చుంనాయుడు, తాటిశెట్టి బాబు, పైడి మధు, గాబు సూరప్పన్న రెడ్డి, నడిపేన రమణ,ఎడ్ల రామకృష్ణ, రౌతు శ్రీరాంమూర్తి,బగాడ్డు ఎల్లాజీ, దేశెట్టి గణేష్ , చాపల సత్తిబాబు, శాంతాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో శుక్రవారం సాయంత్రం నర్తనశాల డ్యాన్స్ అకాడమీ, అమృత శ్రీవర్షిణి సంగీత, డ్యాన్స్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎన్‌సీఎస్ ట్రస్ట్ నిర్వాహకులు విద్యార్థులకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు.

ఓటర్లకు అవగాహన



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: స్వీప్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తపేటలో ఉపాధి హామీ వేతన దారులకు ఓటు హక్కు వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో ఓటర్లకు పలు సూచనలు చేశారు. ఓటును నిర్భయంగా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.